అర్ధంతరంగా నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు



రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలో ప్రధాన డ్రైనేజీ నిర్మాణ పనులు ఏడాదిన్నరగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో దోమలు, మురుగు వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మిస్తామని ఒకరి ఇంటి ప్రహరీ సైతం కూల్చివేసి ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. దీనిపై ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఓపెన్ డ్రైనేజీ



కోల్‌సిటీ: గోదావరిఖని కాకతీయనగర్‌లోని శ్రీనివాస థియేటర్ ఎదుట ఉన్న ప్రధాన ఓపెన్ డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. కాల్వపై నుంచి రాకపోకలు సాగించడానికి నిర్మించిన కల్వర్టుపై ఒకవైపు సైడ్‌వాల్ కూడా నిర్మించలేదు. దీంతో వరద నీరంతా కల్వర్టుపై నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సమీపంలోని ఇళ్లలోకి కూడా వరద నీరు చేరుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి ఓపెన్ డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

జర భద్రం.. చెట్టు కూలిపోయేలా ఉంది



కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్ మెయిన్‌రోడ్డులో రోడ్డుపక్కనున్న ఫుట్‌పాత్‌పై ఉన్న ఓ చెట్టు పూర్తిగా కిందికి వంగిపోయి ఉంది. భారీ వాహనాలు చెట్టు దగ్గరికి రాగానే అకస్మాత్తుగా వాహనాలను టర్న్ చేస్తున్నారు. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు, గాలి దుమారానికి చెట్టు రోడ్డుపై పడిపోయేలా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పట్టణంలోని సుభాష్‌నగర్‌లో శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలన్నారు. పొడి చెత్త కోసం మంగళ, శుక్రవారాలను డ్రైడేగా పాటిస్తూ ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు చెత్తాచెదారాన్ని మురుగుకాలువల్లో వేయొద్దని సూచించారు. వేసిన వారిని గుర్తించి జరిమానా వసూలు చేస్తామన్నారు. వార్డు ఆఫీసర్లు అనూష, అశ్విత, నవ్య, ప్రణీత, శ్రీనివాస్, ప్రదీప్, అనిల్, సుధీర్, కుమార్, అరవింద్, సంజీవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి జయరాజ్, మెప్మా ఆర్పీ లక్ష్మి ఉన్నారు.

హైవే సర్వీస్‌రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని: రాజీవ్ రహదారి వెంట హైవే సర్వీస్ రోడ్డు పనులు శనివారం ప్రారంభం అయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి కవిత థియేటర్ వరకు ఈ పనులు కొనసాగుతాయన్నారు. రామాలయ కమిటీ చైర్మన్ గట్ల రమేశ్, మాజీ కార్పొరేటర్ ముస్తఫా, అధికారులు పాల్గొన్నారు.

సైనికుడికి సత్కారం



సత్కరిస్తున్న కరీంనగర్ మైనార్టీ నాయకులు

పెద్దపల్లిరూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న పెద్దపల్లి పట్టణానికి చెందిన ఆరీఫ్‌ను కరీంనగర్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు శనివారం సత్కరించారు. పంజాబ్ పఠాన్‌కోట్ నుంచి ఆపరేషన్ సిందూర్‌లో ఆరీఫ్ పాల్గొన్నాడని, ఇది ఉమ్మడి కరీంనగర్ జిల్లాకే గర్వకారణమని నాయకుడు తాజొద్దిన్ నేహల్ అహ్మద్, కలిమోద్దిన్, ఆరీఫ్‌ఖాన్ అన్నారు. జాహెద్, ఖదీర్, ఆసిఫ్, షబ్బీర్, మాజీద్, ఇమ్రాన్ ఉన్నారు.

వాలీబాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరహరి (ఐఏఎస్)

పాలకుర్తి: మధ్యప్రదేశ్ ఐఅండ్‌పీఆర్ కార్యదర్శి, ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) తన తండ్రి స్వర్గీయ పరికిపండ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం బసంత్‌నగర్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం బసంత్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలో ఈనెల 19, 20, 21వ తేదీల్లో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉన్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి వాలీబాల్ జట్లు తమ పేర్లు ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు, నాలుగో బహుమతి రూ.ఐదు వేల నగదు అందజేయనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 99486 84345, 99492 47606, 81060 19707 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఎంఆర్‌సీ కార్యాలయంలో శనివారం 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆయా పాఠశాలలకు ఎంఈవో మహేశ్ కుమార్ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు హిందీ వాచకాలు ప్రభుత్వం పంపిణీ చేయక పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై ఎంఈవోను వివరణ కోరగా రెండో విడతలో అన్నిరకాల పుపస్తకాలు అందుతాయన్నారు.

సింగరేణి వార్తలు

పుకార్లు నమ్మొద్దు.. పరిహారం అందిస్తాం



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: కలెక్టర్ ఆదేశాల ప్రకారం పరిహారం అందిస్తామని, పుకార్లు నమ్మొద్దని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. రామగిరి మండలం సుందిళ్ల గ్రామస్తులతో శనివారం జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన భూమిని ఓసీపీ విస్తరణ కోసం కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. ఎక్కువ పరిహారం ఇస్తామని నమ్మించి మోసం చేసే వారితో అప్రమత్తంగా ఉండాలని హితవుపలికారు. గ్రామంలో ఉన్న తగాదాలను గ్రామస్తులే పరిష్కరించుకోవాలని సూచించారు. ఇప్పటికే సింగరేణి, రెవెన్యూ విభాగాల సర్వే కూడా పూర్తయిందని, కొన్ని చెక్కులు కూడా అందజేశామన్నారు. పరిహారం విషయంలో సింగరేణి పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. సుందిళ్ల గ్రామస్తులు, ఆర్జీ–1 ఏరియా అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



సర్టిఫికెట్ అందజేస్తున్న జీఎం నాగేశ్వర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థ సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని ఆర్జీ–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కొలిపాక నాగేశ్వరరావు సూచించారు. స్థానిక వీటీసీలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులకు రెండు వారాల పాటు ఉచిత కంప్యూటర్, డీటీపీ శిక్షణ నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 38 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, బీవీ సత్యనారాయణ, మేనేజర్ సుజిత్, డీవైఎస్ఈ శ్రీనివాస్, శిక్షకులు బెంజిమెన్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో కూల్చివేతలు



కూల్చివేస్తున్న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది

జ్యోతినగర్: ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు మార్కింగ్‌కు అనుగుణంగా శనివారం కూల్చివేతలు ప్రారంభించారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టడం సబబు కాదని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కింగ్ చేసిన మరుసటి రోజున కూల్చివేతలు చేపట్టడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు.

మార్కింగ్ ఇచ్చిన మరుసటి రోజు కూల్చివేతలు ఏంటి

మేడిపల్లి రోడ్‌లో మార్కింగ్ ఇచ్చిన మరుసటి రోజు కూల్చివేతలు చేపట్టడం సరైన విధానం కాదని సీపీఎం నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్ అన్నారు. వ్యాపారస్తులతో కలిసి మాట్లాడుతూ మేడిపల్లి సెంటర్ నుంచి అన్నపూర్ణ కాలనీ వరకు 40 ఫీట్ల రోడ్డు విస్తరణలో కూల్చివేతలకు 15 రోజుల గడువు ఇవ్వలేదని అన్నారు. ముందస్తు నోటీసులు, కనీస గడువు ఇవ్వకుండా చేపట్టిన కూల్చివేతల తొందరపాటుతో వ్యాపారస్తులు నష్టపోయే అవకాశాలున్నాయని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• ఇద్దరికి దేహశుద్ధి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఇద్దరికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల వివరాల ప్రకారం భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి స్థానిక వివాహితకు రెండు నెలల క్రితం ఫేస్‌బుక్‌లో పరిచయం కాగా, అదికాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. రెండురోజులుగా ఇద్దరు ఇంట్లో కలిసి ఉంటుండగా స్థానికులు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అవమానంగా భావించిన వివాహిత హార్పిక్ తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉందని స్థానికులు తెలిపారు.

• జీపులపై కూలిన చింత చెట్టు

ధర్మారం: ధర్మారం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో పార్కింగ్ చేసి ఉన్న రెండు కమాండర్ జీపులపై శనివారం తెల్లవారుజామున గాలివానకు చింత చెట్టు వృక్షం కిందపడటంతో రెండు జీపులు దెబ్బతిన్నాయి. చెట్టు రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన రెడపాక లక్ష్మణ్, నందిమేడారం గ్రామానికి చెందిన మాదాసు తిరుపతి తమ జీపులను రాత్రి చెట్టు కింద పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున వీచిన గాలివానకు చెట్టు కిందపడిపోయింది. దీంతో రెండు కమాండర్ జీపులు దెబ్బతిన్నాయని బాధితులు వాపోయారు. సంఘటన స్థలానికి మండల జీపు అసోసియేషన్ అధ్యక్షుడు కాడే సూర్యనారాయణ వచ్చి సంబంధిత అధికారులతో మాట్లాడి చెట్టును పక్కకు జరిపించారు.


• తప్పిపోయిన పాప.. తల్లిదండ్రుల చెంతకు

గోదావరిఖని: స్థానిక ప్రధాన చౌరస్తాలో తప్పిపోయిన ఐదేళ్ల పాపను గోదావరిఖని వన్‌టౌన్ బ్లూకోల్ట్స్ సిబ్బంది తల్లిదండ్రులకు అప్పగించారు. శనివారం పాప తప్పిపోయిందనే సమాచారాన్ని పోలీసులకు అందగా, అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్స్ పోలీసులు పాప ఫొటోను సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశారు. పాప తల్లితండ్రులు లక్ష్మినగర్‌లో షాపింగ్ కోసం రాగా వారి వద్ద నుంచి ఆడుకుంటూ పాప లక్ష్మినగర్ నుంచి గాంధీచౌక్ వైపు వచ్చి దారిమర్చిపోయింది. పాపను కనిపెట్టిన పోలీసులు పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లారు. పాపను అప్పగించిన వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరుపతి, నవీన్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

• 3 నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

సుల్తానాబాద్: భూభారతి రెవెన్యూ సదస్సులు ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు. మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు 17 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 3న గొల్లపల్లి, సుద్దాల, 4న కాట్నపల్లి గట్టెపల్లి, నీరుకుల్ల, కదంబాపూర్, 5న దుబ్బపేట, తొగర్రాయి, 6న భూపతిపూర్, మంచరామి, 9న సుల్తానాబాద్, పూసాల, 10, 11న రేగడిమద్దికుంట, 11న మియాపూర్, 12న ఐతరాజపల్లి, చిన్నబొంకూర్, రెబ్బల్‌దేవపల్లి, 13న కొదురుపాక, చిన్నకల్వల, 16న కనుకుల, 17న గర్రెపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

జాగృతి కార్యాలయం కార్యదర్శిగా బాలాజీరావు



సుల్తానాబాద్: రాష్ట్ర జాగృతి హైదరాబాద్ కార్యాలయ కార్యదర్శిగా సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావును నియమించారు. శనివారం రాత్రి నియామకం చేయడంతో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ విరమణ సన్మానం



గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన చల్లా రాజిరెడ్డిని శనివారం సన్మానించారు. సైటాఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన రాజిరెడ్డిని సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఎస్‌వోటూ జీఎం రాముడు, ప్రాజెక్టు అధికారి ఉదయ్‌హరిజన్, యూనియన్ నాయకులు వైవీరావు, రాజరత్నం, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఆర్జీ–1 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే



సత్యనారాయణ



లక్ష్మయ్య

గోదావరిఖని: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉత్తమ ఉద్యోగులను సన్మానించనున్నారు. జీడీకే–2, 2ఏ గనిలో హెడ్ ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న బొడ్డు సత్యనారాయణ, ఓసీపీ–1 సీహెచ్‌పీలో కన్వేయర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కొత్వాల లక్ష్మయ్యను ఉత్తమ ఉద్యోగులుగా ప్రకటించారు. వీరిని ఆవిర్భావ దినోత్సవ వేడుక సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జీఎం లలిత్‌కుమార్ సన్మానించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్జీ–2 సీఎంవోఏఐ అధ్యక్షుడిగా రాముడు

గోదావరిఖని: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంవోఏఐ) ఆర్జీ–2 ఏరియా అధ్యక్షుడిగా ఎస్‌వోటూ జీఎం రాముడు ఎన్నికయ్యారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపిక జరిగినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కార్యదర్శిగా సంజీవ్, సంయుక్త కోశాధికారిగా భాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీకి పాముకాటు?

రామగుండం: అంతర్గాం మండలం కుందనపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల్లో పనిచేస్తున్న గ్రామానికి చెందిన ఉపాధి కూలీ చొప్పరి రాజేశ్వరి పనిచేసే స్థలంలో పాము కాటుకు గురైనట్లు తెలిసింది. ఫీల్డ్ అసిస్టెంట్ సునంద ఎంపీడీవో బైరి వేణుమాధవ్, ఈజీఎస్ ఏపీవో రమేశ్‌కు సమాచారం అందించగా అంతర్గాం పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌కిరణ్ సూచనల మేరకు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అసలు పాము కాటేసిందా లేదా మరేదైనా విషపురుగు కుట్టిందా అనే విషయమై స్పష్టత లేదు. డాక్టర్లు ప్రాథమిక చికిత్స చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్వరిని అధికారులు పరామర్శించారు.

నేషనల్ రోవింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్‌మెడల్



గోల్డ్ మెడల్‌తో చిప్ప ధాత్రి

ఫెర్టిలైజర్‌సిటీ: హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ వేదికగా మే 27 నుంచి 31 వరకు జరిగిన 26వ సబ్ జూనియర్ నేషనల్ రోవింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో రామగుంగం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీకి చెందిన చిప్ప ధాత్రి గోల్డ్ మెడల్ సాధించింది. అండర్–13 విభాగంలో విజయం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకుంది. ఈ పోటీల్లో 23 రాష్ట్రాల నుంచి 350 మంది పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి 24 మంది పోటీల్లో పాల్గొనగా చిప్ప ధాత్రి విజయం సాధించి గోల్డ్ మెడల్ సాధించింది. కుటుంబ సభ్యులు, కాలనీవాసులు శనివారం ఆమెను అభినందించారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల: ఓదెల గ్రామంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ సతీశ్ ఆధ్వర్యంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ధూళికట్టకు చెందిన ప్రత్యేక పూజారులతో గ్రామదేవతలకు పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. ఆదివారం పోచమ్మకు బలి ఇవ్వడం తదితర ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

దోపిడీ పీడితం ఉన్నంత వరకు ఎర్రజెండాలు



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: దోపిడీ పీడితం ఉన్నంతవరకు ఎర్రజెండాలు రెపరెపలాడుతాయని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనుకులలో గల గోపీకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సీపీఐ సుల్తానాబాద్ మండల నాల్గో మహాసభలో మాట్లాడారు.దేశంలో దోపిడీ పీడన వ్యవస్థ ఉన్నంతకాలం నక్సలిజాన్ని, వామపక్షాన్ని అంతం చేయడం, నిర్మూలించడం ఎవరికీ సాధ్యపడదని అన్నారు. కార్మికులు, కర్షకులు, పీడిత ప్రజానీకానికి కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా అండగా ఉండి పోరాటాలు చేస్తోందని తెలిపారు. అంతకు ముందు అమరవీరులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి సునీల్ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు రమేశ్, సధాకర్, వెంకటేశ్, రాజమల్లు, కనుకయ్య, సంపత్, రవి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలు



చీరలు అందజేస్తున్న జనక్‌ప్రసాద్, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఐఎన్‌టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. స్థానిక షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తా శ్రీపాదరావు విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జీ–2 ఏరియా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మహిళా పారిశుధ్య కార్మికులతో పాటు రామగుండం మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు యూనియన్ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్ నాయకులతో కలిసి చీరలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మపురి, ఎండీ అక్రమ్, నరసింహారెడ్డి, దశరథంగౌడ్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సుల్తానాబాద్‌రూరల్: ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి దుర్గం గణేశ్

సుల్తానాబాద్‌రూరల్: ఆరోగ్యంగా ఉండాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని గర్రెపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకుకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమయ్య, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి శంకరయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ..

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. వైద్యులు ఉదయ్‌కుమార్, పీహెచ్ఎస్ సౌందర్య, సిబ్బంది ఉన్నారు. భూపతిపూర్, ఐతరాజుపల్లిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన కల్పించారు. వైద్యులు సంతోష్‌కుమార్, ఏఎన్ఎం భూలక్ష్మి ఉన్నారు.

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యుడు అమరేందర్‌రావు, సిబ్బందితో కలిసి శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పొగాకు వాడకాన్ని నిరోధించాలని ప్రతిజ్ఞ చేశారు. ముత్తారం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అడవిశ్రీరాంపూర్ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. పీహెచ్ఎన్ గ్రేసీవన్, సూపర్‌వైజర్ రమాదేవి, లావణ్య, దీప్తి, రమాదేవి, స్రవంతి, సునీత, కళావతి, దుర్గమ్మ, పుష్పలత, రవళి, అనిల్ పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, ఆయుష్ వైద్యులు కేశవరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని ఓదెల, కొలనూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శంజనేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, వైద్యసిబ్బంది కలీమొద్దీన్ పాల్గొన్నారు.

4న వాహనాల వేలం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బండారికుంటలో గల ఎక్సైజ్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడ్డ 10 వాహనాలకు ఈనెల 4న వేలం వేస్తున్నట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యాలయ ఆవరణలో కండిషన్‌లో ఉన్న టీవీఎస్‌స్టార్‌సిటి, టాటాసుమో, టీవీఎస్‌ఎక్సెల్, హీరోగ్లామర్, హోండాయాక్టివా, హోండా షైన్ వాహనాలు, స్క్రాప్‌కండిషన్‌లో ఉన్న హీరోహోండా ప్యాషన్‌ప్లస్ (2) టీవీఎస్‌ఎక్సెల్, టీవీఎస్ సుజుకీ మాక్స్ వాహనాలు ఉన్నాయన్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఈనెల 4 ఉదయం 10 గంటలలోపు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఎలిగేడు: ఎలిగేడు నూతన తహసీల్దార్‌గా ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ యాకన్నను శనివారం కార్యాలయంలో లాలపల్లి మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ప్రకాశ్, సంపత్, పవన్ ఉన్నారు.

భూభారతితోనే సమస్యలు పరిష్కారం

రామగుండం: భూ భారతితోనే భూసమస్యలు పరిష్కారం అవుతాయని అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్ పటేల్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల వారీగా ఒక్కో గ్రామంలో రెండురోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు..

ఈనెల 3, 4వ తేదీన ఎగ్లాస్‌పూర్, అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం, 5, 6న ఆకెనపల్లి, ముర్మూర్, 9, 10న మద్దిర్యాల, ఎల్లంపల్లి, 11, 12న పొట్యాల, విసంపేట, గోలివాడ, 13, 16న సోమనపల్లి, రాయదండి, పెద్దంపేట, 17, 18న లింగాపూర్, కుందనపల్లి, 19, 20న బ్రాహ్మణపల్లి, కుందనపల్లి, మొగల్‌పహాడ్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.